కార్తీకమాసం.. ఆధ్యాత్మికం

• నేటి నుంచి కార్తీకమాసం ప్రారంభం • జోన్ పరిధిలో ముస్తాబైన దేవాలయాలు

నల్లకుంట: ప్రముఖ శైవ క్షేత్రాలుగా విరాజిల్లుతున్న నల్లకుంటలోని శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, లింగాల గడ్డ శివాలయం, తిలక్‌నగర్‌లోని శివాలయం, బీరప్ప దేవాలయం కార్తీక మహోత్సవాలకు ముస్తాబయ్యాయి. న్యూ నల్లకుంట డివిజన్‌లోని శ్రీసీతారాంజనేయ సరస్వతి (న్యూరామాలయం) దేవస్థానం ప్రాంగణంలోని పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి దివ్వ క్షేత్రం కార్తీకమాస ఉత్సవాలకు ముస్తాబు చేశారు. నవంబర్ 2వ తేదీ నుంచి కార్తీకమాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈనెల రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు శరవేగంగా పూర్తి చేశారు.

◆ కార్తీక మాసంలో అంబర్‌పేట నియోజకవర్గం నుంచి అనేక మంది భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక క్యూలైన్లు, తాగు నీటి వసతి ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయాన్ని విద్యుత్ దీపాలతో చక్కగా అలంకరించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జమలాపురం గోపాలరావు శనివారం కార్తీక ఉత్సవాల వివరాలను వెల్లడించారు.


న్యూరామాలయం ప్రాంగణంలోని పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి దివ్య క్షేత్రం

కార్తీక ఉత్సవాల్లో నిర్వహించనున్న కార్యక్రమాలు..

◆ కార్తీక మాసోత్సవాల్లో నవంబర్ 2 నుంచి డిసంబర్ 1వ తేది వరకు ప్రతి రోజు కార్తీక మహాన్యాస పూజలు, కార్తీక మాస ఏక రుద్రాభిషేకం, కార్తీక మాస నెలవారి దీపం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ఏక రుద్రాభిషేకాలు ఉంటాయని చెప్పారు.

◆ మహోత్సవాల్లో మొదటి సోమవారం(4వ తేదీన) ఉదయం మహా శివుడికి క్షీరాభిషేకం ఉంటుందన్నారు.

◆ 11వ తేదీన (రెండో సోమవారం) పెరుగుతో అభిషేకం.


న్యూ నల్లకుంటలోని శ్రీ సీతారాంజనేయ సరస్వతి ఆలయం

◆ 15వ తేది(శుక్రవారం) పూర్ణిమ రోజున శివయ్యకు నెయ్యితో అభిషేకం ఉంటుంది. అలాగే సాయంత్రం ఆలయ ప్రాంగణంలో జ్వాలా తోరణం ఉంటుంది.

◆ 18వ తేదీన (మూడో సోమవారం) తేనేతో అభిషేకం.

◆ 25వ తేదీన (చివరి సోమవారం) శివుడికి పంచదార అభిషేకం ఉంటుంది.

◆ 29వ తేదీన మాస శివరాత్రిని పురస్కరించుకొని సాయంత్రం 6.30 గంటలకు శివ పార్వతుల కళ్యాణం, అనంతరం ప్రసాద వితరణ ఉంటుంది.

◆ అభిషేకాలు, ఆర్జిత సేవలు నిర్వహించాలనుకునే భక్తులు ఇతర వివరాల కోసం ఆలయ పూజారి జ్ఞానేశ్వర్, ఆలయ గుమస్తాను సంప్రదించాలని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జమలాపురం గోపాల రావు కోరారు.

ఆలయంలోని శివ లింగం


అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



కార్తీక మాసంలో ఈ శైవ క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఇందు కోసం అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాం. భక్తుల సహకారంతో కార్తీకోత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నాం.

– జయంతి,
ఆలయ కార్యనిర్వహణ అధికారిణి

నేడు ముషీరాబాద్‌లో సదర్ వేడుకలు

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో శనివారం సదర్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్ తెలిపారు. శుక్రవారం ముషీరాబాద్‌లో సదర్‌లో పాల్గొనే దున్నపోతులను ప్రదర్శించి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సదర్ వేడుకలకు బీఆర్ఎస్ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహమూద్ అలీ, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీ బడుగు లింగయ్యయాదవ్, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే ఊరేగింపులో జానపద కళాకారులు, బోనాలు, పోతరాజులు, బతుకమ్మ, కోలాటం తదితర కళా ప్రదర్శనలు ఉంటాయన్నారు. హరియాణా నుంచి తీసుకొచ్చిన ఘోలు, శ్రీకృష్ణ, షేర్, విధాయక్ దున్నలు పాల్గొంటాయని తెలిపారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు వరుణ్, అభినందన్‌యాదవ్, సాయి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

సాయిమల్లుకు న్యాయం జరిగేలా చూడండి

కాచిగూడ పోలీసులకు గోపాల్‌రావు విజ్ఞప్తి

కాచిగూడ: హరాస్‌పెంటలోని హిందూ స్మశాన వాటికలో పని చేస్తున్న సాయిమల్లు (65) గత పది రోజుల క్రితం శ్మశానవాటిక వద్ద రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొని మృతి చెందాడని శ్మశానవాటిక ప్రబంధక సమితి అధ్యక్షుడు ఎస్.గోపాల్ రావు తెలిపారు. నింబోలిఅడ్డలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ... పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారని తెలిపారు. సాయిమల్లు మృతికి కారణమైన వారిని త్వరితగతిన పట్టుకుని బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా న్యాయం జరిగే విధంగా చూడాలని ఆయన కాచిగూడ పోలీసులకు విజ్ఞప్తి చేశారు. సాయిమల్లు రోడ్డు ప్రమాదంలో మరణించి పది రోజులు గడుస్తున్నా ఆయన మృతికి కారణమైన వారిని పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని అన్నారు. ఈ విషయంలో త్వరలోనే రాష్ట్ర డీజీపీ, నగర పోలీస్ కమిషనర్‌ను కలుస్తామని పేర్కొన్నారు.

కార్యకర్తలు ప్రజల మధ్యలో ఉండాలి

చిక్కడపల్లి: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్‌ను గురువారం కాంగ్రెస్ నేత గుండు జగదీష్‌బాబు మర్యాదపూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని అంజన్‌కుమార్ యాదవ్ సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకుల పాశం అనిల్‌యాదవ్, సురేష్‌యాదవ్, బాబురావు, భీమ్‌యాదవ్, మేడే సురేష్ పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే అభివృద్ధి

డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్

కవాడిగూడ: ఐకమత్యంతోనే అభివృద్ధిని సాధిస్తామని.. ఐకమత్యమే మహాబలమని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నిరూపించారని ప్రొగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఇండియా జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ అన్నారు. శుక్రవారం సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకోని డాక్టర్ హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్, నవరభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రామకృష్ణ మఠంలోని బాలల సేవా విభాగంలో రఘునందన్ మహారాజు సహకారంతో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు యోగా గురువు సరోజిని రామారావు, డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్, శోభారాణి, జ్యోతి రాజా, జయశ్రీ తదితరులు విద్యార్థులకు బహుమతులు, పజిల్స్, పుస్తకాలతోపాటు టపాసులు అందజేశారు.

◆ ఈ సందర్భంగా డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ మాట్లాడుతూ... ఐకమత్యం ఉన్నచోట సమాజంలోని అన్ని అంశాలు సామరస్యంగా పనిచేస్తాయని, వివాదాలు తక్కువగా ఉంటాయని తెలిపారు. యోగా గురువు సరోజిని రామారావు మాట్లాడుతూ... విభిన సాంస్కృతులు, సాంప్రదాయాలు, మతాలు, భాషలతో కూడిన భారత దేశంలో ప్రజల మధ్య ఐక్యతను కొనసాగించడం ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో శోభారాణి, హారతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపావళి పూజలు


శంకరమఠంలో లక్ష్మీదేవి అలంకరణలో శారదాంబ


సాయిబాబాను దీపాలతో అలంకరించిన దృశ్యం

నల్లకుంట: నల్లకుంటలో గురువారం దీపావళి పూజలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా నల్లకుంట శంకరమఠం, న్యూ రామాలయంలో సరస్వతి ఆలయం, సాయిబాబా మందిరం తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ప్రజలు తమ ఇళ్లల్లో లక్ష్మి పూజలు నిర్వహించి, సాయంత్రం తమ వ్యాపార కేంద్రాలలో లక్ష్మి పూజలు చేసి ఇరుగు పొరుగులకు మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం పిల్లాపాపలతో కలిసి తమ ఇళ్ల ముందు టపాకాయలు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో సాయంత్రం సాయిబాబాకు దీపారాధన చేశారు.

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు

కాచిగూడ రైల్వేస్టేషన్‌లో మీడియా పర్యటన నిర్వహించిన అధికారులు


కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పించి మాట్లాడుతున్న రైల్వే అధికారులు గోవింద్‌రావు, బాలాజీ తదితరులు

కాచిగూడ: రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఎప్పటికప్పుడు తగిన ఏర్పాట్లు చేస్తూ ప్రయాణికుల్లో అవగాహన కల్పిస్తున్నట్లు హైదరాబాద్ డివిజనల్ రైల్వే అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ కె.గోవిందరావు, కాచిగూడ స్టేషన్ డైరెక్టర్ కె.బాలాజీ తెలిపారు. రైల్వే అధికారులు సిబ్బందితో కలిసి శుక్రవారం కాచిగూడ రైల్వేస్టేషన్‌లో మీడియా పర్యటనను నిర్వహించారు.

సిస్టమిక్ మేనేజ్‌మెంట్‌ను నిర్ధారణకు ఏర్పాట్లు..

◆ ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. పండుగల సందర్భంగా సీజన్‌లలో ప్రయాణికుల రద్దీని ఎదుర్కొనేందుకు సిస్టమిక్ మేనేజ్‌మెంట్‌ను నిర్ధారించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ప్రస్తుత దీపావళి, ఛట్ పూజ పండుగ సీజన్ దృష్ట్యా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. దానికి అనుగుణంగా హైదరాబాద్ డివిజన్ రైల్వే పరిధిలో ప్రయాణికుల రద్దీని సజావుగా, వ్యవస్థాగతంగా నిర్వహించేందుకు అనేక చర్యలు చేపట్టినట్లు వారు పేర్కొన్నారు.

రద్దీకి అనుగుణండా ఆరు ప్రత్యేక రైళ్లు..

◆ ప్రయాణికుల రద్దీకనుగుణంగా హైదరాబాద్ డివిజన్‌లో ఆరు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు తెలిపారు. కాచిగూడ రైల్వే స్టేషన్‌తో పాటు అన్ని ప్రధాన రైల్వే స్టేషన్లలో ఆర్‌పిఎఫ్, టిక్కెట్ చెకింగ్ సిబ్బందిని పటిష్టం చేసినట్లు తెలిపారు. జనరల్ కోచ్‌లలో క్రౌడ్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించి క్యూ లైన్లను అనుసరించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రయాణికులు స్టేషన్‌లోకి ప్రవేశించినప్పటి నుంచి రైలు ఎక్కే వరకు అడుగడుగునా ప్రయాణికులకు మార్గనిర్దేశం చేస్తున్నామన్నారు.

◆ దీంతో ఇబ్బంది లేని రైలు ప్రయాణాన్ని నిర్ధారిస్తున్నామని అన్నారు. ప్రత్యేక రైళ్లకు సంబంధించిన సమాచారం అందించేందుకు తరచూ ప్రకటనలు కూడా చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాచిగూడ ఆర్‌పీఎఫ్ జీఎస్ మల్, సీసీఐ టి.రంగనాథ్, సీహెచ్ఐ అశ్వినికుమార్, సీబీఎస్ఆర్ బి.చంద్రమోహన్, సీఆర్ఐ ఎం.రఫత్ బేగ్, సీటీఐ వర్కీ, ఐఓడబ్ల్యూ గణేష్, పీఆర్ఐ శైలేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా బీబీఆర్ వేణు

కాచిగూడ: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా బీబీఆర్ వేణును నియమిస్తూ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ శుక్రవారం పార్టీ కార్యాలయంలో నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీబీఆర్ వేణు మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి చేస్తున్న కృషికి ఈ పదవి రావడంపై హర్షం వ్యక్తం చేశారు.

నాసిరకంగా టాయిలెట్ల నిర్మాణం!


సుందరయ్య పార్కులో పైపై మెరుగులతో టాయిలెట్ల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్లు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నగరంలో ప్రతిష్ఠాత్మకమైన బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో ఇటీవల లక్షలాది రూపాయలతో నిర్మించిన టాయిలెట్లు అభివృద్ధి పనులు నాసిరకంతో పూర్తి చేశారని పలువురు వాకర్స్ వాపోతున్నారు. పై పై మెరుగులతో సుందరీకరించి ఎక్కువ బడ్జెట్ కాంట్రాక్టర్లు తీసుకోవాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. పాత టాయిలెట్ గోడలకు సిమెంటు కోటింగ్ ఇచ్చి వాటికి రంగులు వేసినట్లు వాకర్స్ ఆరోపిస్తున్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం కాకుండా జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి పర్యవేక్షణ చేసిన తరువాతనే నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

పాలవ్యాన్ ఢీకొట్టడంతో హోంగార్డుకు గాయాలు

కాచిగూడ: పాల వ్యాను ఢీకొని హోంగార్డుకు గాయాలైన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్, అడ్మిన్ ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం ... మహబూబ్‌నగర్‌కు చెందిన జగదీశ్వర్ (35) కాచిగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున కాచిగూడ స్టేషన్ పరిధిలో అతడిని పాల వ్యాన్ ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని కూలీ మృతి

కాచిగూడ: రైలు ఢీకొని కూలీ మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం... ఓయూ మాణికేశ్వరినగర్‌కు చెందిన సురేష్ (45) కూలి పనిచేస్తుంటాడు. గురువారం రాత్రి ఆర్ట్స్ కాలేజీ స్టేషన్ వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

4న అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం

◆ అధికార ప్రతిపక్ష నాయకులకు ఆప్ రాష్ట్ర కమిటీ ఆహ్వానం
◆ మూసీ బాధితుల సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని వినతి


ఎమ్మెల్సీ కోదండరాంను కలిసి అఖిల పక్ష సమావేశానికి రావాలని ఆహ్వానిస్తున్న ఆప్ నేతలు

కవాడిగూడ: హైడ్రాతో భయపడుతున్న మూసీ బాధితులకు అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని అధికార ప్రతిపక్ష నేతలకు ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు తార్నాకలో ఎమ్మెల్సీ కోదండరాం, బీఆర్ఎస్ నేత మాజీ ఎంపీ బి. వినోద్ కుమార్, టీడీపీ నాయకులు రావుల చంద్రశేఖర్‌రెడ్డిలతోపాటు సీపీఐ, సీపీఎం, బీజేపీ, ఎంఐఎం నేతలను కలిశారు. మూసీ బాధితుల సమస్యల శాశ్వత పరిష్కారానికి నవంబర్ 4న ఆప్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించే అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. మూసీ ప్రాజెక్టును అన్ని కోణాల నుంచి పునః పరిశీలించి అఖిల పక్ష సూచనలు, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) అనుమతులు, బాధితులకు పునరావాసం కల్పించడం తదితర డిమాండ్లపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సమావేశానికి అఖిల పక్ష పార్టీల నేతలతో పాటు మేధావులు, ఉద్యమకారులు, పర్యావరణవేత్తలు, విద్యావేత్తలు హాజరవుతున్నారని వారు తెలిపారు.

మెస్ చార్జీల పెంపుపై బీసీ సంక్షేమ సంఘం హర్షం

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని హాస్టల్స్, గురుకుల పాఠశాలల విద్యార్థుల మెస్ చార్జీలను పెంచడం పట్ల బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. గతం కంటే మెస్ చార్జీలను బాగా పెంచారని అభినందించారు.

◆ గురుకులాలు, హాస్టల్స్‌లో చదువుకునే 8.50 లక్షల మంది విద్యార్థులకు ఈ మెస్ చార్జీల పెంపుతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. కాలేజీ హాస్టల్స్‌కు రూ.1500 నుంచి రూ.2100కు, గురుకుల హాస్టల్స్‌లలో 3వ తరగతి నుంచి 7వ తరగతి వరకు రూ.950 నుంచి రూ.1330, 8వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.1100 నుంచి రూ.1540 వరకు పెంచారని అదే విధంగా కాస్మొటిక్ చార్జీల పెంపుపై కూడా ఆయన హర్షం వ్యక్తం చేశారు.

◆ మంచి మెనూ తయారు చేసి పౌష్టికాహారం పెట్టాలని కోరారు. అయితే బీసీ హాస్టల్స్‌కు సొంత భవనాలు నిర్మించాలని అలాగే కాలేజీ హాస్టల్ విద్యార్థులకు నెలకు రూ.500 పాకెట్ మనీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, గోరిగే మల్లేష్‌యాదవ్, పి.సుధాకర్, నీల వెంకటేష్, నందగోపాల్, అనంతయ్య, ఉదయ్, రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నింబోలిఅడ్డలో వైభవంగా సదర్ ఉత్సవాలు

కాచిగూడ: అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి కన్నె రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నింబోలిఅడ్డ చౌరస్తాలో సదర్ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కాచిగూడ, గోల్నాక, చాదర్‌ఘాట్, అంబర్‌పేట, ముషీరాబాద్ తదితర ప్రాంతాల నుంచి సుమారు 50 వరకు దున్నలు ఉత్సవాలకు వచ్చాయి. దున్నల విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఉత్సవాలకు హాజరైన దున్నల యజమానులకు జ్ఞాపికలను అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్ కుమార్ యాదవ్, మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు ఎస్.గౌతంరావు, కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


నింబోలిఅడ్డలో దున్నరాజులతో రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్

ప్రముఖ గాయకుడు త్రినాథరావుకు భక్తిగాన సుధాకర బిరుదు



చిక్కడపల్లి: చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో శ్యామగాయిత్రి మ్యూజిక్ అకాడమీ నిర్వహణలో చింతలపూడి త్రినాథరావు భక్తిగీతాల గానం సమ్మోహనం కార్యక్రమం జరిగింది. ఈ గాన సమ్మోహనానికి హాజరైన హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ భవానీప్రసాద్ మాట్లాడుతూ.. 70పైబడిన వయస్సు ఉన్న త్రినాథరావు పాటలను మధురంగా పాడటం ఆయన పూర్వజన్మ సుకృతమని అన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ.. త్రినాథరావు నిరంతరం గాన సాధన చేయడం వల్ల ఆయన వయస్సు మీదపడినా మంచిగా పాడుతున్నారని అన్నారు. దర్శకుడు రేలంగి నరసింహారావు, నిర్మాత రామసత్యనారాయణ, గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి, వంశీ రామరాజు తదితరులు వారికి అభినందనలు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు చిల్ల శివపార్వతి నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో త్రినాథరావును అతిథులు భక్తిగాన సుధాకర బిరుదుతో సత్కరించారు.

దీపావళి శోభ

పండుగ వెలుగులు.. లక్ష్మీదేవికి పూజలు


గాంధీనగర్ కార్యాలయంలో కాకరపువ్వులు కాలుస్తున్న కార్పొరేటర్ పావని దంపతులు


ముషీరాబాద్‌లో బాణాసంచా కాల్చుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నాయకులు


శివాలయం వీధిలో కుటుంబ సభ్యులతో బాణాసంచా కాల్చుతున్న బీఆర్ఎస్ నేత శ్రీధరాచారి


సీజెడ్ డీసీపీ అక్షాన్స్‌యాదవ్‌ను కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలుపుతున్న అక్లాఖ్ హుస్సేన్

ముషీరాబాద్: పండుగలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకొని ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గౌరీశంకర ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధరాచారి, ముషీరాబాద్ చౌరస్తాలో బీఆర్ఎస్ నేత శివముదిరాజ్ ఆధ్వర్యంలో దీపావళి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే ముఠా గోపాల్ బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ ముఖ్య అతిథిగా హాజరై లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్యకర్తలతో కలిసి బాణాసంచా కాల్చి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి వెలుగులు ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలను నింపాలన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు సదా, పార్టీ నాయకులు ఎండి మోహిన్, వీరేష్, శ్రీనివాస్, రాజు, హేమచక్రధర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

◆ భోలక్‌పూర్ డివిజన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అక్లక్ హుస్సేన్ ఆధ్వర్యంలో సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాంన్స్ యాదవ్‌ను కలిసి పూలబోకే అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. డీసీపీని కలిసిన వారిలో భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షులు మహ్మద్ ఆలీ, పార్టీ సీనియర్ నాయకులు నబీ తదితరులున్నారు.


పద్మశాలి కాలనీలో లక్ష్మీదేవికి పూజలు చేస్తున్న కాలనీ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు


గంగపుత్రకాలనీలో దీపాలను వెలిగిస్తున్న మహిళ


ముషీరాబాద్‌లో బాణాసంచా కాల్చుతున్న బీఆర్ఎస్ నేత బల్లా ప్రశాంత్ తదితరులు


దీపావళి సంబరాల్లో ముషీరాబాద్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి